ప్రజాశక్తి
శుక్రవారం 28 జులై 2023
5
అల్లూరి సీతారామరాజు



సరిహద్దు వివాదంపై సమావేశం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని ఖండ్రుమ్ పంచాయతీకి అనుకుని ఉన్న ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు రాయపాడు గ్రామంలో చోటుచేసుకున్న వివాద ఘటనపై చటువ అతిథి గృహంలో సమస్య పరిష్కారానికై ఆంధ్ర, ఒడిశా ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించినట్లు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్, తహసిల్దార్ సిహెచ్ నాగమ్మ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. మండలంలోని ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు విషయమై ఆంధ్ర, ఒడిస్సా అధికారులతో సమావేశాన్ని నిర్వహించి సరిహద్దు ప్రాంతానికి వివాదంగా మారిన రాయపాడు విషయంపై రెండు రాష్ట్రాల అధికారులు చర్చించుకోవడం జరిగిందన్నారు. ఆ గ్రామం ఒడిస్సా లేక ఆంధ్ర సరిహద్దుకు వర్తించాలన్న దానిపై అన్ని కోణాల్లో సర్వే ద్వారా నిర్ణయించాల్సి ఉందన్నారు. ఈ సమావేశానికి ఆంధ్ర నుంచి మండల రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో పాటు ఒడిస్సా కోరాపుట్ సబ్ కలెక్టర్, నందపూర్ ఎస్‌డిపిఓ, బిడిఓ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

పోటెత్తిన గోదావరి, శబరి

★ జల దిగ్బంధంలో రహదారులు, గ్రామాలు
★ నిలిచిన రవాణా, రాకపోకలు
★ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్న బాధితులు



సహాయ చర్యలకు బోట్ల వద్ద సిద్ధంగా ఉన్న ఎంపిడిఒ, విఆర్ఒ, సిబ్బంది

ప్రజాశక్తి-చింతూరు

భారీ వర్షాలు, ఎగువ నుండి వరద నీటి ప్రవాహంతో గోదావరి, శబరి నదులు పోటెత్తాయి. బుధవారం రాత్రి నుండి గురువారం ఉదయం వరకు వరద ఉధృతి పెరిగి భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మూడో ప్రమాద హెచ్చరిక (53అడుగులు) దాటి 54 అడుగులకు చేరింది. గురువారం సాయంత్రానికి క్రమంగా తగ్గి 48.40 అడుగులకు చేరి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. 11,77,133 క్యూసెక్కుల వరద నీరు దిగువకు వెళుతుంది. కూనవరం వద్ద గోదావరి నీటి మట్టం 40.84 అడుగుల వద్ద కొనసాగుతోంది. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం బుధవారం నాటికి 32 అడుగులు ఉండగా, గురువారం సాయంత్రానికి 41.6 అడుగులకు చేరింది. బుధవారం రాత్రి నుండి గురువారం ఉదయం వరకు పెరిగిన నీటిమట్టాలు మధ్యాహ్నం నుండి స్వల్పంగా తగ్గుముఖం పట్టగా, గురువారం అర్ధరాత్రి నుండి వరద మళ్ళీ పెరిగే అవకాశం ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



రాయనపేట వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

స్తంభించిన రవాణా వ్యవస్థ

వరద తాకిడికి రాష్ట్ర, జాతీయ రహదారులు కోతకు గురవుతున్నాయి. రహదారులు మూసుకుపోవడంతో నాలుగు రాష్ట్రాలకు కూడలిగా ఉన్న చింతూరు నుండి రవాణా వ్యవస్థ స్తంభించింది. కొయగూరు వాగు పొంగి ప్రవహించటంతో రెండు రోజులుగా ఆంధ్ర ఒడిస్సాకు రవాణా నిలిచింది. చట్టి వద్ద జాతీయ రహదారి-30పై వరద నీరు చేరడంతో భద్రాచలం- చింతూరుకు రాకపోకలు ఆగిపోయాయి. దీంతో పలు వాహనాలు రోడ్డుపై బారులు తీరాయి. సోకులేరు వాగు ఉధృతి వల్ల చింతూరు-విఆర్.పురం మండలాలకు రవాణా సౌకర్యం లేదు. రాబోయే మూడు రోజుల్లో వరదలు మరింత ప్రమాదకరస్థాయిలో పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

జల దిగ్బంధంలో గ్రామాలు

ఎటపాక : వరద ఉధృతి వల్ల మండలంలోని నందిగామ, మురుమూరు, బండారిగూడెం, చలంపాలెం, ఎర్రగట్టు, వీరయిగూడెం గ్రామాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. రాయనపేట వద్ద జాతీయ రహదారిపై వరదనీరు ప్రవహిస్తుండడంతో అంతరాష్ట్ర సర్వీసులు నిలిచిపోయాయి. మండలంలో వరద ముంపునకు గురయ్యే గన్నవరం, గొల్లగూడెం గ్రామాల ప్రజలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం రాత్రి పునరావాస కేంద్రాలకు తరలించారు.



సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు ట్రాక్టర్‌కు సామగ్రి ఎక్కిస్తున్న దృశ్యం



నిండు కుండలా శబరి, గోదావరి సంగమం

భయం గుప్పెట్లో ప్రజలు..

కూనవరం : భారీ వర్షాలు, గోదావరి వరద ప్రవాహంతో ముంపు గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో ఉన్నారు. భద్రాచలం నుండి కూనవరం ప్రధాన రహదారిలో మురుమూరు వద్ద భారీగా వరద నీటి వల్ల రాకపోకలు బందయ్యాయి. ఇటు కూనవరం- చింతూరు వెళ్లే రహదారిపైనా నీరు చేరడంతో కూనవరం మండలానికి భాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. గురువారం నాటికి గోదావరి ఉధృతి పెరగడంతో కూనవరం, టేకులబోరు గ్రామాల ప్రజలు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

విఆర్.పురం : మండలంలోని ఒడ్డిగూడెం, అడివి వెంకన్నగూడెం, రామవరం, సోంపల్లి, సుష్టివారిగూడెం, చింతరేగుపల్లి, గుర్రంపేట, విఆర్ పురం గ్రామాల చుట్టూ వరద నీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శ్రీరామగిరి, కొల్లూరు, కోటార్ గోమ్ము, ములకలపల్లి జలదిగ్బంధంలో ఉన్నాయి. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ప్రజలను ఖాళీ చేయించి పునరవాస కేంద్రాలకు తరలిస్తున్నారు. తరలించిన గ్రామాల ప్రజలకు బరకాలు, ఐదు లీటర్ల కిరోసిన్, పాల ప్యాకెట్లు, నిత్యవసర సరుకులు, మంచినీరు తక్షణమే అందించాలని ప్రజలు కోరుతున్నారు.



డిగ్రీ కాలేజీలో అరకొర సౌకర్యాలతో ఉన్న పునరావాస కేంద్రం



స్వయంగా గుడారాలు ఏర్పాటు చేసుకుంటున్న కొమ్మూరు గ్రామస్తులు

స్వయంగా గుడారాల ఏర్పాటు

ప్రజాశక్తి- చింతూరు

చింతూరు మండలం, కొమ్మూరు గ్రామం చంద్రవంక వాగు ఎగపోటుతో ముంపునకు గురైంది. సుమారు 50 కుటుంబాలు ఉన్నాయి. వీరికి ప్రభుత్వం పునరావాసం ఏర్పాటు చేయలేదు. సురక్షిత ప్రాంతాల్లో గుడారాలు వేసుకునేందుకు కనీసం ప్లాస్టిక్ కవర్లు కూడా ఇవ్వలేదు. దీంతో వారే బరకాలు కొనుగోలు చేసుకొని స్వయంగా వెదురుతో కర్రలతో గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామం నుండి వేరే ప్రాంతానికి వెళ్లడానికి బోటు కూడా ఏర్పాటు చేయలేదు. తక్షణమే మామిళ్ళ గూడెం నుండి నరసింహపురం వరకు మర బోటు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కట్టెలు తడిసి పోవడంతో వంట చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. కిరోసిన్ కూడా ఇవ్వకపోవడంతో కారు చీకటిలో జీవనం సాగిస్తున్నారు. తక్షణమే కిరోసిన్, కొవ్వొత్తులు, నిత్యావసర సరుకులు అందజేయాలని తుమ్మల ఎంపీటీసీ వేక రాజకుమార్ స్థానిక అధికారులను కోరుతున్నారు.

గుడ్డి దీపం కూడా కరువైంది



వరద రావడంతో గుడారం స్వయంగా వేసుకున్నాను. కానీ చీకటి పడితే పాములు, తేళ్లు ఎక్కడ కాటు వేస్తాయోనని భయంగా ఉంది. గుడ్డి దీపం కూడా లేదు. అధికారులు కనీసం కొవ్వొత్తులు, కిరోసిన్ కూడా ఇవ్వలేదు. బియ్యం మాత్రం ఇచ్చి వెళ్లిపోయారు. బియ్యం తిని ఎలా బతకాలి? తక్షణమే కిరోసిన్, నిత్యావసర వస్తువులు అందించాలి.

- బొక్క జోగయ్య, కుమ్మూరు గ్రామం, చింతూరు

బరకాలు కూడా ఇవ్వలేదు



పునరావాస కేంద్రానికి తరలించినా అక్కడ జాగా లేదు. రోడ్లమీద గుడారాలు వేసుకుందామంటే కనీసం బరకాలు కూడా ఇవ్వలేదు. నిత్యావసర సరుకులు అందించలేదు. ఈ బాధలు భరించలేం. మాకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తే ఇక్కడ నుండి వెళ్ళిపోతాం.

- వద్దాణపు మోహన్ రావు, విఆర్.పురం

గొడుగుల కింద ఉన్నాం



వర్షానికి గొడుగుల కింద కూర్చొని ఉన్నాం. ఏ అధికారి వచ్చి చూడలేదు. ఇప్పటివరకు కనీసం పాల ప్యాకెట్ కూడా ఇవ్వలేదు. తక్షణమే బరకాలు, నిత్యావసర సరుకులు ఇవ్వాలి.

- గూటాల కళావతి, రాజుపేట, విఆర్.పురం మండలం

ముంపు గ్రామాల్లో సిపిఎం నాయకుల పర్యటన



ముంపునకు గురైన గ్రామస్తులను కలిసిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- విఆర్.పురం

ముంపునకు గురైన ఒడ్డిగూడెం కాలనీలో సిపిఎం నాయకులు గురువారం పర్యటించారు. మునిగిపోయిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ ఇళ్లల్లోకి వరద వచ్చినా, అధికారులు, వాలంటీర్లు స్పందించలేదని విమర్శించారు. పునరవాస కేంద్రాల్లో పాకలు వేసుకున్న వారికి తక్షణమే బరకాలు, నిత్యవసర సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడి వెంకన్నగూడెం, రామవరం గ్రామాలను ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు కారం సుందరయ్య, వద్లాది రమేష్ సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు పంకు సత్తిబాబు, ప్రకాష్‌రావు, నూకరాజు పాల్గొన్నారు.

తహశీల్దారుకు వినతి

మండలంలోని శ్రీరామగిరి గ్రామం ముంపునకు గురి కావడంతో గుట్టలపై తలదాచుంటున్న ప్రజల వద్దకు సిపిఎం నాయకులు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, స్థానిక సర్పంచ్ పులి సంతోష్ కుమార్ శ్రీరామగిరి ప్రజల సమస్యలపై తహశీల్దారు ఎన్.శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అడవిలో చిమ్మచీకటిలో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, వారికి పరదాలు, నిత్యావసర సరకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోడి మల్లయ్య వెంకటమ్మ, చిచ్చు సత్యనారాయణ, గుండిపూడి లక్ష్మణ్‌రావు, టి.నాగేశ్వరరావు, ఏ.కాంతారావు, ఎన్.రాజు, ఎన్.చందర్రావు పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

జెడ్‌పిటిసి పర్యటన

ఒడ్డి గూడెం గ్రామంలో జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి మంచినీరు, బియ్యం, మంచి నూనె, కిరోసిన్, కొవ్వొత్తులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు నరేష్, కన్నారావు పాల్గొన్నారు.



బాధితులను కలిసిన జెడ్‌పిటిసి రంగారెడ్డి

విజయసాయిరెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

-బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని పార్లమెంట్‌ను కోరడంపై నిరసన
-అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించి, అమలు చేయాలని ఈ నెల 26న పార్లమెంట్‌లో వైసిపి రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి మాట్లాడడంపై ఎపి ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని లోదొడ్డి పంచాయతీ పరిధి కేశవరం గ్రామంలో గురువారం విజయసాయిరెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పార్లమెంట్ ఆమోదించిన అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు, మండల నాయకులు మేలిన రమేష్ మాట్లాడుతూ, బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడం సరికాదని, గిరిజనులకు నష్టకలిగించే చర్యలకు వైసిపి పాలకులు పాల్పడడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రానున్న ఎన్నికల్లో గిరిజనులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం గిరిజనుల పొట్టగొడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విషయంపై వైసీపీ గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు తమ వైఖరి తెలపాలని, లేకుంటే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మురళి, మనుగుల రాజు, లోతా అర్జున్, కె. కృష్ణ, మేలిన గంగ, లోవకుమారి, రామలక్ష్మి, బాలకొండ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలురూరల్:బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వైసిపి ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వెంటనే కేంద్రం ఆమోదించాలని పెద్దల సభలో విజయసాయిరెడ్డి ప్రకటించటాన్ని ఖండిస్తూ మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం పూర్వపు జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో ఉన్న మైనింగ్ ని కొల్లగొట్టాలని బోయ/వాల్మీకుల పేరుతో చిచ్చు పెట్టాలని చూస్తున్నాయన్నారు. ఇందులో భాగంగానే చింతపల్లి ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టును ప్రైవేట్ వ్యక్తులకు కట్ట బెట్టాలని చూస్తున్నారని తెలిపారు. ఇప్పటికే జీవో 3 రద్దుతో మైదాన ప్రాంతం నుంచి అనేకమంది ఉద్యోగులు గిరిజన ప్రాంతానికి వస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో వందలాదిమంది గిరిజన నిరు ద్యోగులకు ఉద్యోగాలు రాలేదన్నారు. రాజకీయ లబ్ధి పొందాలని వైసిపి ప్రభుత్వం, టిడిపి, బిజెపి పార్టీలు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు కిల్లో సర్బన్న, స్థానిక సర్పంచ్ పలాస మాధవరావు, స్థానిక సీత గుంట ఎంపీటీసీ కె.బొంజుబాబు, జేఏసీ నాయకులు వెచ్చంగి కొండయ్య, స్థానిక వైస్ సర్పంచ్ బొండా గంగాధరం, పృథ్వీరాజు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొర్ర కొండబాబు పాల్గొన్నారు.



విజయసాయిరెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతలు



పెదబయలులో నినాదాలు చేస్తున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ఆదివాసీల సంపద దోచుకునేందుకు కుట్ర

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసీలను మోసం చేయడంలో వైసిపి, బిజెపి దొందు దొందేనని, పిఎం మోదీ మెప్పు కోసం సిఎం జగన్ రాష్ట్ర గిరిజనుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఆదివాసీలను బలి చేస్తున్నారని ఆదివాసి జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆదివాసీల సంపద దోచుకునేందుకు ఆదివాసీలను సమూలంగా నిర్మూలించే స్థితికి వైసిపి, బిజెపి ప్రభుత్వాలు దిగజారుతున్నాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేశంలో, రాష్ట్రంలో ఆదివాసీలపై, ఆదివాసీల హక్కులు, చట్టాలు రిజర్వేషన్లపై వరుసగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వీర్యం చేస్తున్నాయన్నారు.అటవీ వనరులు, గిరిజనుల సాంస్కృతిక, వారసత్వ సంపదను దోచుకునేందుకు బిజెపి ప్రభుత్వ నిర్ణయాలపై ఒక్క మాట మాట్లాడకుండా సిఎం జగన్ కేసుల నుండి ఉపశమనం పొందుతున్నారని ఆరోపించారు.

మరణాల నివారణే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:ప్రస్తుత వరద ప్రభావిత ప్రాంతాలలో ఎటువంటి మరణాలు సంభవిం చకుండా వరద భాధితులకు రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం ఉదయం ముంపు మండలాలపై నిర్వహించిన జూమ్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వరద ప్రభావిత ప్రాంతాలలో తీసుకోవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేసారు. రానున్న రెండు రోజులూ అత్యంత కీలకంగా భావించాలని, ఎటువంటి అవాంచనీయ పరిస్థితులు లేకుండా అందరూ సురక్షితంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. భద్రాచలం వద్ద గోదావరి 53 నుండి 55 అడుగుల వరకు చేరుకొనే అవకాశం ఉన్నందున అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి బృందాలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. బాధితులందరూ సురక్షిత ప్రాంతాలకు వెళ్ళే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముంపు మండలాలలో తహసిల్దార్లు, సబ్-ఇన్స్పెక్టర్ల పర్యవేక్షణలో పడవలు సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, డీజిల్, టార్పాలిన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు చేరుకున్న కుటుంబ సభ్యులకు మూడు రోజులకు సరిపడా కేజీ కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాల దుంపలు, కూరగాయలు సరఫరా చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పునరావాస కేంద్రాల వద్ద తాగు నీరు, జనరేటర్ సిద్ధం చేయాలన్నారు. వైద్య శిభిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ జూమ్ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, ఎఎస్పీ రాహుల్, డి.ఎం.హెచ్.ఓ జమాల్ బాష, తహసిల్దార్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాలు పూర్తి చేయండి : పిఒ

ప్రజాశక్తి-పాడేరు: ఎస్‌సిఎ గ్రాంట్ నిధులతో చేపట్టిన అంగన్వాడీ భవనాలను ఆగస్టు 15 నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. గురువారం పాడేరు మండలంలోని మినుములూరు గ్రామంలో నిర్మిస్తున్న అంగన్వాడి భవన నిర్మాణ పనులు పరిశీలించారు. భవన నిర్మాణాల్లో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని ఆదేశించారు. నాణ్యమైన టైల్స్ ఫ్లోరింగ్‌కి వినియోగించాలని సూచించారు. అనంతరం మినుములూరు నుండి కోడిగుడ్లు గ్రామానికి వెళుతున్న రహదారిలో సిసిడిపి నిధులు రు. 40 లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను పరిశీలించారు. పి.గొందూరు గ్రామంలో నాడు నేడు లో నిర్మిస్తున్న అంగన్వాడి భవన నిర్మాణపు పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ, డివిఆర్ ఎం.రాజు, డిఈ అనుదీప్ ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి, సూపర్వైజర్ రాజేశ్వరి, మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న పిఒ

ప్రయాణమంటే భయమేస్తోంది

వడ్డాది నుంచి ఘాట్ రోడ్డు వరకూ రోడ్డు బాగుచేయరా ?
నేమ్‌బోర్డు దాచుకొని వెళ్లాల్సిన దుస్థితి
స్థాయి సంఘ సమావేశంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర
ప్రోటోకాల్ పాటించకపోతే సిఎంకు ఫిర్యాదు


మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖపట్నం : 'వడ్డాది నుంచి ఘాట్ రోడ్ వరకూ రోడ్డు బాగోలేదు. ఈ రోడ్డులో ప్రయాణిస్తున్నపుడు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ నేమ్‌బోర్డు కారులో దాచి వెళ్లాల్సి వస్తోంది. ఇంత ఘోరంగా రోడ్డు వుంటే ఎలా? ఎంతోమందికి ఉపయోగపడే ఈ రోడ్డుకు మరమ్మతులు చేయకపోతే ప్రజలెన్ని ఇబ్బందులు పడతారో ఆలోచించారా ?' అని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన ఒకటి నుంచి ఏడు జిల్లా పరిషత్ స్థాయి సంఘం సమావేశాల్లో ఆమె మాట్లాడారు. వర్షాలు పడితే ప్రయాణాలు చేయలేని పరిస్థితిలో రోడ్డు వున్నాయన్నారు. భీమిలి మండలంలో కెజిబివి ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించని విషయాన్ని జెడ్‌పిటిసి సభ్యుడు గాడు వెంకటప్పడు తెలపగా దీనిపై ఛైర్‌పర్సన్ స్పందిస్తూ జెడ్‌పిటిసి, ఎంపిపిలను ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవని శాఖాధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మరోసారి తమను ఆహ్వానించలేదన్న మాట సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తే కలెక్టర్, ముఖ్యమంత్రికి లేఖ రాస్తానన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద సరుగుడు మొక్కలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్న విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్‌కు ఆమె సూచించారు. సొంత పొలాల్లో ఇంటి అవసరాల కోసం చెట్లను కొట్టుకునే రైతులను ఇబ్బంది పెట్టవద్దని అటవీ శాఖాధికారులను కోరారు. పాడేరు డివిజన్‌లో పాఠశాల భవనాలు మంజూరైనట్లు విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ తెలిపారు. భీమిలి జెడ్‌పిటిసి వెంకటప్పడు మాట్లాడుతూ నాడు - నేడు కింద ఎంత ఖర్చుపెట్టినా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులే పిల్లలు చేరడం లేదన్నారు. కృష్ణంరాజుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 110 నుంచి 50 మందికి విద్యార్థులు తగ్గారని తెలిపారు. సీజనల్ వ్యాధులు, కళ్ల కలకల వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో హాస్టల్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఛైర్‌పర్సన్ సుభద్ర ఆదేశించారు. విద్యార్థులు ప్రయివేటు కాలేజీలకు వెళ్తుండడం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంసెట్ శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోటవురట్ల, చీడికాడ జెడ్‌పిటిసి సభ్యులు సిద్దాబత్తుల ఉమాదేవి, లాలం శారద వరలక్ష్మి అన్నారు. నర్సీపట్నం జెడ్‌పిటిసి రమణమ్మ మాట్లాడుతూ నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు సంతృప్తికరమైన సేవలందిస్తున్నప్పటికీ లిఫ్ట్, జనరేటర్ వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలేదన్నారు. మంచంపై ఇద్దరు గర్భిణులను సర్దుబాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచాల మోడల్ పాఠశాలలో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని జెడ్‌పిటిసి శారద వరలక్ష్మి కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి పి.శ్రీరామమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి డి.సత్యనారాయణ, జెడ్‌పిటిసిలు, వివిధ ప్రభుత్వ శాఖాధికారులు పాల్గొన్నారు.

22 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ : మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అరకులోయ సిఐ సిహెచ్ రుద్రశేఖర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గురువారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్ఐ సంతోష్, పోలీసు సిబ్బంది తనిఖీలు చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో సుకుమార్ న్యాథ్లీ, మన్ ప్రీత్ సింగ్ పంజాబ్ రాష్ట్రం, ఎస్.రమేష్ తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా కు చెందిన వ్యక్తులుగా గుర్తించామని తెలిపారు. అరకులోయ పరిసరాల ప్రాంతం నుండి గంజాయి సేకరించి ఢిల్లీ తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఎస్ఐ సంతోష్ ఉన్నారు.

గిరిజన ప్రజా ప్రతినిధులు మౌనం వీడాలి

బోయ/వాల్మీకులపై విజయసాయిరెడ్డి ప్రస్తావించినా మిన్నకుంటారా?
- ఆదివాసీ ప్రజా సంఘాల, పార్టీల నాయకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వైసిపి, బిజెపి ప్రభుత్వాల హయాంలో ఆదివాసీల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లపై వాటిల్లుతున్న ముప్పు ఆదివాసీల చరిత్రలో మునుపెన్నడూ లేదని ఆదివాసి గిరిజన, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టిల్లో చేర్చే అసెంబ్లీ తీర్మానానికి గిరిజన వైసిపి ఎమ్మెల్యేలు తమ మద్దతును తెలపడం..తాజాగా బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానంపై కేంద్రం సత్వరమే చర్యలు తీసుకోవాలని పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మాట్లాడడం మహా ద్రోహం అని మండిపడుతున్నారు. పార్లమెంట్ లో వైసిపి ముఖ్య నేత విజయసాయిరెడ్డి మాటలకు గిరిజన ప్రజా ప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదివాసీలకు వైసిపి ప్రభుత్వం చేస్తున్న మోసంపై ఇప్పటికైనా గిరిజన ఎంపి, ఎమ్మెల్యేలు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదివాసీల మనుగడ, రిజర్వేషన్లపై జరుగుతున్న నష్టాలపై మాట్లాడకపోతే చరిత్రలో ఆదివాసీల ద్రోహులుగా మిగిలిపోతారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీల ప్రయోజనాలకు తీరని ద్రోహం చేసే వైసిపి, బిజెపి ప్రభుత్వాల నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బోయ/వాల్మీకీతో పాటు అనుబంధ కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలన్న వైసిపి ప్రభుత్వ అసెంబ్లీ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసి సమాజం అనేక నిరసన, ఆందోళన పోరాటాలు చేస్తున్నప్పటికీ గిరిజన ప్రజా ప్రతినిధులు, వైసిపి ప్రభుత్వం తీరు మారకపోవడం దారుణమంటున్నారు. ఇతర కులాలను ఎస్ టి జాబితాలో చేర్చేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సాక్షిగా ఆదివాసీలకు ద్రోహం చేస్తూ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నారు. రాష్ట్రంలో వైసిపి, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాలు ఆదివాసీలకు అన్యాయం చేస్తుంటే ఆదివాసీ ప్రజా ప్రతినిధులు కనీసం నోరు మెదపకపోవడం దుర్మార్గమని, ఇప్పటికైనా స్పందించి ఆదివాసీల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్ల ప్రయోజనాల కోసం పోరాడాలని ఆదివాసీలలు డిమాండ్ చేస్తున్నారు.

ఆదివాసీలకు వెన్నుపోటు..



బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని ఆదివాసి సమాజం వ్యతిరేకిస్తూ అనేక ఆందోళనలు, పోరాటాలు చేస్తుంటే ఈ విషయమై పార్లమెంట్ సమావేశంలో ఎంపి విజయసాయిరెడ్డి మాటలు ఆదివాసీలకు వెన్నుపోటు. ఆదివాసీల రిజర్వేషన్ల ప్రయోజనాలపై వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యానికి, తీరుకు నిదర్శనం. ఆదివాసి సంప్రదాయాలు, భాష, ఆహారపు అలవాట్లు, పోడు వ్యవసాయం, జీవన విధానాలకు భిన్నంగా ఉండే ఇతర కులాలను ఎస్‌టిల్లో చేర్చేందుకు ముందుకెళ్లడం దుర్మార్గమైన చర్య. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనం కోసం, ఆదివాసీల సంపదను దోచుకునేందుకు ముమ్మర ప్రయత్నం.

పి.అప్పలనర్స, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలి



ఆదివాసీల మనుగడ సమస్యపై ఎంపి విజయసాయిరెడ్డి రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలపై గిరిజన ఎంపి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్, ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం దురదృష్టకరం. ఆదివాసీల ఉద్యోగ అవకాశాల జిఒ-3 సుప్రీంకోర్టు రద్దు చేయడంతో వాటి ప్రయోజనాల కోసం పట్టించుకోని ప్రభుత్వం, ఎస్‌టి జాబితాలో ఇతర కులాలను చేర్చాలని వైసిపి ప్రభుత్వం చేసిన అసెంబ్లీ తీర్మానంపై కేంద్రం సత్వర చర్యలు తీసుకోవాలనడం ఆదివాసి జాతికి ద్రోహం చేయడమే.

ఆదివాసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ అసెంబ్లీ తీర్మానం చేయడం, వాటిపై చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ లో ఎంపి వ్యాఖ్యలపై గిరిజన ఎంపి స్పందించక పోవడం బాధాకరం.

వంపూరి గంగులయ్య
జనసేన అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్

ఎంపీ, ఎమ్మెల్యేల వైఖరి తెలపాలి



వైసిపి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బోయ వాల్మీకుల రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై ఎంపి, ఎమ్మెల్యేలు తమ వైఖరి స్పష్టం చేయాలి. సిఎం జగన్.. ఆదివాసీల ద్రోహి అని ఇప్పటికైనా ఆదివాసీలు గుర్తించాలి. కేవలం ఓట్ల రాజకీయాన్ని దృష్టిలో ఉంచుకునే వైసిపి, బిజెపి ప్రభుత్వాలు వ్యవహరిస్తోంది. ఆదివాసీల జీవన విధానానికి పూర్తి భిన్నంగా ఉన్న బోయ వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చాలని ఎంపి విజయసాయిరెడ్డి పార్లమెంట్‌లో అడగడాన్ని ఆదివాసి గిరిజన సంఘం తీవ్రంగా ఖండిస్తోంది.

కిల్లో సురేంద్ర,
ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆదివాసీలకు ప్రభుత్వాల ద్రోహం



మరొకసారి అధికారం కోసం ఓట్ల రాజకీయం చేస్తున్నారు. ఓట్ల కోసం ఎంతకైన దిగజారుతారు. ప్రధాని మోదీ మెప్పు కోసమే సిఎం జగన్ తపిస్తూ వైసిపి, బిజెపి కలసి ఆదివాసీలను బలిచేస్తున్నారు.
బోయ వాల్మీకిలను ఎస్ టి జాబితాలో చేర్చేందుకు కేంద్రం సత్వర చర్యకై పార్లమెంట్‌లో ఎంపి విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు ఆదివాసీలకు సిఎం జగన్ ద్రోహం చేయడమే. బోయ వాల్మీకిలను ఎస్ టి జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ తీర్మానంపై తీవ్రంగా ఉద్యమిస్తున్న ఈ తరుణంలో పార్లమెంట్‌లో ఎంపి వ్యాఖ్యలు గిరిజనుల రిజర్వేషన్ల పట్ల వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. ఆదివాసీల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లను నిర్వీర్యం చేయడంలో వైసిపి, బిజెపి పార్టీలే వేరు తప్ప, విధానాలు ఒక్కటే.

రామారావు దొర
జెఎసి జిల్లా కన్వీనర్

గీతం 'బిజినెస్' కోర్సుల్లో ప్రవేశాలు

- 28లోగా అడ్మిషన్ టెస్ట్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబిఎ, బిబిఎ, బికాం కోర్సులలో ప్రవేశాలకు విశాఖ ప్రాంగణంలో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర తెలిపారు. ఎంబిఎలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్ సప్లైచైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రీసోర్సెస్, బిజినెస్ ఎనలటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్ స్పెషలైజేషన్లను ఆఫర్ చేస్తున్నట్లు తెలిపారు. డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. దీంతోపాటు బిబిఎ, బికామ్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా గీతం అడ్మిషన్ టెస్ట్-2023 కు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అంద జేస్తామన్నారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి అరకులోయ రూరల్ : హత్య కేసులో నిందితుడు తానే స్వయంగా నేరాన్ని ఒప్పుకొని లొంగిపోవడంతో అరెస్ట్ చేసినట్లు అరకులోయ సిఐ సిహెచ్ రుద్రశేఖర్ తెలిపారు. మండలంలోని బస్కీ పంచాయతీ మొర్రిగుడకు చెందిన పాంగి కొమ్ములును హత్య చేసినట్లు పోలీసు స్టేషన్ వచ్చి నిందితుడు రాజు లొంగిపోయినట్లు తెలిపారు. తరచూ భార్యతో గొడవలు పడే నిందితుడు రాజును ఇంటి ఎదురుగా ఉన్న పాంగి కొమ్ములు జోక్యంచేసుకుని సర్ది చెప్పడంతో ఈ నెల 25న రాత్రి తొమ్మిది గంటల సమయంలో కొమ్ములును రాజు ఇంటి బయటకు పిలిచి పీకపై గట్టిగా నొక్కేసి హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు.దీంతో రాజును అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్ పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని వివిధ మండలాల్లో కొన్నేళ్లుగా గ్రామీణ తాగునీరు సరఫరా విభాగంలో (ఆర్‌డబ్లుఎస్) పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని, శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు ఆధ్వర్యంలో గురువారం పాడేరు గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ కార్యనిర్వహక ఇంజనీరు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కాంట్రాక్ట్ కార్మికుల నాయకులు సిహెచ్ గోపీచంద్ మాట్లాడుతూ, ఏళ్ల తరబడి గ్రామీణ ప్రాంతంలో నీటి సరఫరా చేస్తున్న కార్మికులను థర్డ్ పార్టీ కాంటాక్ట్‌లో పని చేస్తున్నారని, వేతనం నెలకు నాలుగు వేల నుండి 9 వేల వరకు చెల్లిస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.శంకర్రావు, ఎస్ ప్రసాదరావు, 11 మండలాల నుండి కార్మికులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ :గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామంలో స్థానిక సిపిఎం సర్పంచ్ పి సునీత ఆధ్వర్యంలో టెక్నో సర్వ్ సహకారంతో ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వ్యాధులతో బాధపడుతున్న సుమారు 40మందికి కంటి పరిక్షలు నిర్వహించారు. 15మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపికచేసి ఎల్వి ప్రసాద్ ఆసుపత్రికి తరలించారని సర్పంచ్ పి సునీత చెప్పారు. వార్డుమెంబర్స్ పాంగి, సత్యనారాయణ పి రాజ్‌కుమార్, టెక్నో సర్వ్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ జెమ్మ, వి శివ తదితరులు పాల్గొన్నారు.

వెలసిన మావోయిస్టుల వాల్‌పోస్టర్లు

ప్రజాశక్తి- పెదబయలు: ఈనెల 28 నుండి ఆగస్ట్ 3 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అల్లూరి ఆదివాసీ అభివృద్ధి సమితి పేరుతో గురువారం రాత్రి పెదబయలు, బొంగరం, ఇంజారి ప్రాంతాల్లోవాల్‌పోస్టర్లు వెలసినట్లు స్థానిక ఎస్ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు.

జి. మాడుగుల: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో బుధవారం రాత్రి మధ్యగరువు నుర్మతి జిమాడుగుల, గ్రామంలో అల్లూరి ఆదివాసి అభివృద్ధి సమితి పేరిట వాల్ పోస్టర్లు దర్శనమిచ్చాయి అందులో క్రింది విధంగా పేర్కొన్నారు మా గిరిజనులు చంపి వారోత్సవాలు జరుపుకుంటారా మావోయిస్టు వారోత్సవాలు వలన ,మా గిరిజనులకు ఒరిగినది ఏముంది అని పోస్టర్లలో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ముమ్మర కూంబింగ్ చర్యలు చేపడుతున్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

కళ్ల కలకల నివారణపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - సీలేరు : కళ్ళ కలకల నివారణకు విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. గురువారం దారకొండ ఎంపీయూపీ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళ్ళ కలకలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణంలో కలిగిన మార్పులు వల్ల జలుబు, దగ్గు, జ్వరం తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందని, వ్యాధి సోకిన వెంటనే ఉపాధ్యాయుల సహకారంతో ఆసుపత్రి వచ్చి మెరుగైన చికిత్స పొందాలని సూచించారు. ప్రస్తుతం కళ్ళ కలకలు అధికంగా వ్యాప్తి చెందుతున్నాయని, ఇతర విద్యార్థులకు దూరంగా ఉండాలని, కంటి చుక్కల మందులు తరచు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్వో పోతురాజు, ఏఎన్ఎంలు శోభ, ఈశ్వరి పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని దొడ్డవరం గ్రామం వద్ద పంట కాలువ వంతన కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరి, ప్రస్తుత వర్షాలకు కూలిపోవడంతో పంటలకు నీరు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని, తక్షణమే కొత్త పంట కాలువ వంతెన నిర్మించాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు కూలిపోయిన పంట కాలువ వంతెను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న వంతెనను మరమ్మతులు చేయాలని పలు మార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూలిపోవడంతో పంటలకు సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, తక్షణమే కొత్త కాలువ వంతెన నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాగిన బుజ్జిబాబు, గూడుపు లక్ష్మణ్, జి.శ్రీనుబాబు, సిగ్గు భావన, వాసం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన భవన నిర్మాణ పనులు

ప్రజశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెల నూతన భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈఈ బివిఎస్ఎన్.మూర్తి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్ భవన నిర్మాణ పనులను ఈఈ మూర్తి గురువారం పర్యవేక్షించారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ సిబ్బంది, అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ నిర్మాణ దశలో ఉన్న భవనాలను ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలాఖరుకు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎనిమిది గ్రామ సచివాలయాలు, 8 రైతు భరోసా కేంద్రాలు, 4 వెల్నెస్ సెంటర్ల భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. నత్త నడకన పనులు చేసే కాంట్రాక్టర్లను మార్చి వారి స్థానంలో కొత్త కాంట్రాక్టర్లకు మూడు భవనాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఈ శ్రీనివాసరావు, జేఈఈ రవితేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నవాజ్‌కు అవార్డు

ప్రజాశక్తి - అడ్డతీగల : ఫైలట్ డే సందర్భంగా అరబిందో యాజమాన్యం అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోరం డివిజన్లో 108 వాహనంలో పనిచేసే డ్రైవర్లకు ఇచ్చే బెస్ట్ ఫైలెట్ అవార్డు మండలానికి చెందిన ఎస్‌కెబి.నవాజ్‌కు దక్కింది. 108 వాహనం ఇంధన సామర్థ్యాన్ని పెంచుట, రోగులను నిర్ణీత సమయానికి హాస్పిటల్‌కు చేర్చడం, వాహనం మరమ్మతులు లేకుండా విధులు నిర్వహించినందుకు ఈ అవార్డు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరబిందో యాజమాన్యం ప్రతినిధులు సంపత్, హెచ్ఆర్ గంగాధర్, జిల్లా మేనేజర్ అవినాష్, ఫ్లీట్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన


మోతుగూడెంలో నిరసన తెలుపున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-మోతుగూడెం
దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జెఎసి పిలుపు మేరకు స్థానిక మోతుగూడెం ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం ముందు విద్యుత్ ఉద్యోగులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1998 విద్యుత్ సంస్కరణల చట్టం ప్రకారం త్రైపాక్షిక ఒప్పందాలను, గతంలో కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2022 ఏప్రిల్ నుండి పిఆర్‌సి, డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, సమాన పనికి సమాన వేతనం కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాలని, తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అమలు చేయాలని కోరారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కార్యాలయం ముందు గురువారం విద్యుత్ ఉద్యోగులు నలబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వై.సత్తిబాబు మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వ నెరవేర్చే వరకు దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు సత్యనారాయణ, దాద్రాజు, బి.రమేష్, ఇంజనీర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం

ప్రజాశక్తి - రంపచోడవరం
పది రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు, ఎగువ ప్రాంతాల నుండి ఉప్పొంగి వస్తున్న వరద నీరు ప్రవాహంతో రంపచోడవరం నియోజకవర్గంలో ఐదు మండలాల ప్రజలు ముంపునకు గురవుతున్నారని, ముందస్తు ప్రణాళికలతో వారిని కోవడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆరోపించారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కంటితుడుపుగా వరద బాధితుల దగ్గరికి వెళ్లి వైసిపి నాయకులు ఏం చేశారని ప్రశ్నించారు. బాధితులకు సహాయ సహకారాలు అందించకపోవడం దారుణమన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో బోట్లు ఏర్పాట్లు గాని, వారికి కావలసిన వనరులుగాని అందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముంపు బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే గ్రామాల్లో పర్యటించి మొద్దు నిద్ర పోతున్న ప్రభుత్వానికి ప్రజల తరఫున కళ్ళు తెరిపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, అనంత మోహన్, సిద్ధ వెంకన్న, చక్రపాణి పాల్గొన్నారు.

నేటి నుండి మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు


అడవిని జల్లెడ పడుతున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు : మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాలు ఈనెల 28 నుండి ఆగస్టు 3 వరకు నిర్వహించేందుకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఇప్పటికే ఏవోబి సరిహద్దుల్లో గిరిజనులకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముందస్తుగానే మావోయిస్టు అమరవీరుల స్థూపాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల్లో అదనపు పోలీసు బలగాలను మొహరించి అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. అమరవీరుల వారోత్సవాలు జరగనివ్వకుండా భగ్నం చేయడానికి సరిహద్దులో ఆంధ్ర ఒరిస్సా పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేస్తూ మావోయిస్టు కదిలికలపై నిఘా పెట్టారు. మావోయిస్టులకు కోవట్లుగా వ్యవహరిస్తున్న వ్యక్తులపై పోలీసులు దృష్టి పెట్టారు.

వారోత్సవాలు నేపథ్యంలో ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని సరిహద్దు గిరిజనులు భయాందోళన చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఎఒబి సరిహద్దుల్లో పోలీసులు జాడ అంతంత మాత్రంగా ఉండగా, వారోత్సవాలు నేపథ్యంలో ప్రాంతం పోలీసుల అధీనంలోకి వెళ్లింది. ఈ దృశ్యాలను గిరిజనులు చూసి మళ్లీ ఎటువంటి సంఘటనలు చోటు చేసుకుంటావని భయమ గుప్పిట్లో భీతిల్లుతున్నారు.

ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతల అప్రమత్తం

మావోయిస్టుల వారోత్సవాలు నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులను పోలీసులు అప్రమత్తం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ పార్టీల నాయకులకు నోటీసులు జారీ చేశారు. ఎవరైనా ఊరు విడిచి వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.


నిండుకుండలా జలాశయం

రిజర్వాయర్లలో జలకళ

ప్రజాశక్తి -సీలేరు
పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జీకే వీధి మండలం సీలేరు కాంప్లెక్స్ పరిధిలో జలాశయాలు జలకలను సంతరించుకుంది. వర్షాలకు ఎత్తయిన కొండలపై నుంచి వర్షపు నీరు రిజర్వాయర్లో చేరుతుండడంతో క్రమేపి జలాశయాలు నీటిమట్టలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో నీటి సమస్య ఏర్పడినప్పటికీ ప్రస్తుత వర్షాలు సీలేరు కాంప్లెక్స్ జలాశయాలకు జీవం పోసినట్టు అయింది. జోలాపుట్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే జలాశయంలో నీటి నిల్వ 34.27 టీఎంసీలు సామర్థ్యం కాగా ఈనెల 17 నాటికి 1.8605 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం జులై 27 నాటికి 4.0479 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జోలాపుట్ జలాశయానికి రోజుకు 4537 క్యూసెక్కుల నీరు చేరుతుంది. ఆంధ్ర ఒడిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయంలో 1516 అడుగులు సామర్థ్యం కాగా జులై 17 నాటికి 1454.40 నీటి నిల్వలు ఉండగా, ప్రస్తుతం 1465.10 అడుగులకు పెరిగింది. ఒక రోజుకి 14855 క్యూసెక్కుల నీరు బలిమెల జలాశయంలో చేరుతుంది. సీలేరు జలాశయం పూర్తి నీటిమట్టం 1360 అడుగులు కాగా ఇక్కడ 4.33 టీఎంసీలు నీటిని నిల్వ చేయవచ్చు. ప్రస్తుత వర్షాలకు 1343.40 అడుగులకు నీటి నిల్వలు చేరాయి. రోజుకి 4666 క్యూసెక్కుల నీరు చేరుతుంది. దిగువ సీలేరు డొంకరాయి జలాశయం నీటి సామర్థ్యం 1037 అడుగులు కాగా, జులై17 నాటికి 975 అడుగులు ఉండగా, 27 నాటికి 999.20 అడుగులకు నీటిమట్టం పెరిగిందని సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ ఇంజనీర్ కెకెవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు.



సరుకులు అందజేస్తున్న ఆరోగ్య రాజు

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - అడ్డతీగల : మండలంలోని రాయపల్లి పంచాయితీ వెదుళ్ళ కొండ గ్రామానికి చెందిన మడకం కష్ణ, మల్లీశ్వరిలకు చెందిన తాటాకు ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమై, తీవ్ర నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న అడ్డతీగలకు చెందిన సాక్షి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ఆరోగ్య రాజు సంస్థ ప్రతినిధులతో కలిసి ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించి 25 కేజీల బియ్యం, 12 రకాల కిరాణా సామాన్లు, 10 రకాల కూరగాయలు, నూతన వస్త్రాలు అందజేశారు. బాధిత కుటుంబంతో కలిసి భోజనం చేసి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ ఎస్తేరురాణి, కె.జ్ఞాన భూషణం, కె.శ్యామ్, షారోను స్థానికులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టు ట్రస్టుకు రాజ్య భాష పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2022 - 23 సంవత్సరానికిగాను రాజ్య భాష గౌరవ సన్మాన్ పురస్కారం విశాఖపట్నం పోర్టు అథారిటీని వరించింది. విశాఖ నగర అధికార భాష అమలు కమిటీ ఛైర్మన్, స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్ ఈ పురస్కారాన్ని విపిఎ ప్రతినిధులకు అందజేశారు.